


పక్కవాడంటే పడని రోజుల్లో ప్రపంచమంతా నన్నసహ్యిస్తున్నట్టు తోచేది. ఎవర్నన్నా ప్రేమిస్తున్నట్టనిపించిందో, నా ఆప్యాయతను పంచుకోడానికెంత విస్తృత సమాజమైనా చాలక 'ఈ లోక మెంత చిన్నదో?' అనిపించేది కూడా కొన్నాళ్లు. అలా అని కనబడ్డ కన్నెపిల్లనల్లా ప్రేమించడం సబబనుకోకపోయినా, ఈ ప్రేమరోగం నాలో కాస్త మోతాదును మించి, నన్ను ముంచెత్తిస్తోందని ఒప్పుకోక తప్పదు. మనో దౌర్బల్యం మగ్గి మగ్గి, బ్రహ్మరాతకు లొంగి లొంగి కాలవాహినిలో కరిగి కరిగిపోయే నాలాంటి చరిత్ర హీను లీ కాలంలో కొల్లలు కదా!

ఆ పిల్ల ప్రేమించింది నన్నూ
పెళ్లి చేసుకున్నది మరొకర్నీ!
కొత్తేం కాదు ... మనిషి మనిషికీ మమతలు వివిధం!
అంటే - మనిషి కో 'నొప్పి' మరి ...

# నొప్పి

డా॥ ఏల్చూరి విజయ రాఘవరావు

మా నాయనమ్మకు వృద్ధాప్యం 'నొప్పి', మా ప్రిన్సిపాల్‌గారికి డబ్బున్నా గౌరవం కొరతనే నొప్పి!

నాకు పేరు ప్రతిష్ఠలు రావడం మా కాలేజీలో బోలెడుమందికి 'నొప్పి' ...

అదలా ఉంచండి. అసలు నా 'నొప్పే'మిటో నాకు తెలియకుండానే దిగజారుతోంది దీపం! నేనూ వెనుదీయలేదు సుమండీ! పెళ్లయిన ప్రియదర్శిని మీద కసిదీర్చుకోడానికేమో - మా నాయనమ్మ చూసిపెట్టిన సంబంధాన్ని కళ్లు మూసుకుని చేసేసుకున్నా, ఆ అమ్మాయి పెళ్లయిన వారం తిరగకుండానే!

'అదృష్టవంతుణ్ణే' అనుకోకూడదూ? నే చేసుకున్న ఆ అన్నపూర్ణ నాకు బ్రహ్మాండమైన భార్యలా తయారైంది కొద్దిరోజుల్లోనే.

అయినా ఊరుకున్నానా?

ఏ నొప్పికైనా మందు వెదకవచ్చు కానీ, ఈ ప్రేమ రోగానికి పిచ్చి కుదరడ మంటూ ఉండదు కదా! ఆ ఇల్లాలిని - ఆ గృహలక్ష్మిని ముప్ప తిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్లు తాగించా! కారణం ... 'ప్రేయసి'కీ, 'భార్య'కూ అంతరం తెలియని ఘోరమైన అజ్ఞానపు రోజులేమో అవి! సొంత తప్పులను కాలం మీదకు తోసెయ్యడం మానవుల జన్మహక్కులా భావించే నా 'పిచ్చి' భరించలేక ఆమెకూ 'పిచ్చి' పట్టింది!

ఇప్పుడూ 'అదృష్టవంతుణ్ణే' అనుకోకూడదూ! విసిగి విసిగి వేసారి, ఆమె నన్ను వదిలేసి పుట్టింటి కెళ్లిందో లేదో ... ఆ భగవంతుడే స్వయంగా ఆమె కష్టాలను తరింపజేశా డనుకుంటా!

ఆమె స్వర్గస్తురాలైనట్టు - నా మీద కోపంతో ఉత్తరం ముక్క కూడా రాయలేదు వాళ్ల వాళ్లు.

ఆ అధ్యాయంలో మిగతా కథ అనవసరం: ఆ నొప్పికీ, ప్రస్తుతపు కథకూ అవినాభావ సంబంధం ఉన్నా, దాన్ని గురించి నే చర్చించదలుచుకోలా.


ముచ్చటగా మూడోసారి తెలిసే చేస్తున్న మరో పాపం!

ఈ రంగనాయకికి నా హృదయ రంగప్రవేశమైం దిటీవల.

ప్రేమ కాదు, గీమ కాదు, అదొక తిక్కని నాకు తెలుసు. కాలుజారి పడీ పడీ గాయాలు తగిల్తేనే తప్ప, నా కాళ్లమీద నే నిలబడగల శక్తెలా తెచ్చుకోడం చెప్పండి? కాగా, బ్రహ్మరాతను మార్చడం నా తరమా మరి!

వెయ్‌వేల సార్లయినా ఆమె మనస్సును జయించలేక విఫలుడైనా ననుకోండి! 'మరొకసారి మళ్లీ యత్నించి చూస్తా' ననుకునేవాణ్ణి.

ఇక్కడా, అక్కడా, ఎక్కడైనా సరే ... ఎటు



చూసినా ఆమే ఆమె! సర్వాంతర్యామి! మా కాలేజీ బస్సులో రంగనాయకి ఎక్కడ కూర్చుంటే అక్కడికే సీదాగా నా దృష్టి మళ్లేది.

కనపడీ కనపడని గాజు రేకుల్లాంటి నైలాన్ చీర మడతలు, మత్తెక్కించే మందస్మిత వదనారవిందం, చెళుకూ బెళుకులతో చురుకైన పలుకులకు వత్తాసిగా పసిపాపల్లాంటి అమాయకపు చూపులు ... విచిత్రమైన కలయిక కదూ!

బలిష్ఠమైన అంగవిన్యాసంలో దాక్కున్న పవిత్రమైన కన్నెరికపు యౌవన రేఖ లా పళంగా వెతికిన దొరక వీ రోజుల్లో. అందుకే కామోసు, అణు వణువూ ఆకర్షించింది న న్నామె. అయినా మిగతా రంగు రంగుల ప్రపంచ మంతటినీ గర్హిస్తూ, మరిచినా మరవరాని నా విచిత్ర సామాజిక స్థితి నవహేళన చేస్తూ, ఇరవై నాలుగు గంటలూ ఈమె అందా న్నిప్పుడు కన్నుల పండుగగా జుర్రుతూ పోవాలనుకోవడం నిజంగా చాదస్త మనిపించేది నా కప్పుడప్పుడూ.

ఇంతకన్నా అందమైన అప్సరసలను నే నెప్పుడూ చూడనేలేదా?!

ఇక దాచుకోలేను. నన్ను గురించి మరికొన్ని

విషయా లిక్కడ చర్విత చర్వణం చేసుకుని తీరాలి.

'ఎ హౌస్ కెనాట్ ఇన్‌వేరియబులీ బి ఎ హోమ్' కదూ! నా కో అంతఃపురంలాంటి ఇల్లుంది. కానీ కాపురం లేదు. పెళ్లయినా ప్రస్తుతం అవివాహితుణ్ణే కదా!

పేరెన్నికగల చిత్రకారుణ్ణి. నలభైకి పైచిలుకు వయస్సు. ప్రపంచం మారుమూలలా నా చిత్ర కళా ప్రదర్శనా లెన్నో ఢంకా బజాయించాయి. మా కాలేజీలో మాంచి హోదా గల ఉద్యోగస్థుణ్ణి. పారిస్‌లో నగ్న చిత్ర కళా ప్రదర్శనాల్లో ఎన్నోసార్లు నే గీచిన న్యూడ్స్ ప్రముఖ స్థానా న్నాక్రమించుకున్నాయి. లండన్‌లో రంగు రంగుల రాత్రి జీవితం తనివితీరా చూశాను. న్యూయార్క్‌లో విందు బల్లల మీదే చిందులు తొక్కుతూ, బారులు తీసి బంజారా నృత్యం చేసే భువనసుందరీల మురాల్లోంచి హఠాత్తుగా ఒక్కత్తె మన ఒళ్లోకే దూకేస్తుం దనుకోండి!!

ఇలాంటి సంఘటన లెన్ని జరిగినా చలించని నన్ను - ఈ రంగనాయ కిప్పుడు నాకు మైకం కమ్మించి కంపింప చేస్తోందంటే ఈమెలోని అయస్కాంతంలాంటి ఆ 'అగ్ని' తీక్షణతను నే నెలా వర్ణించడం?! చిందులు తొక్కే నా చిత్ర కళా జీవితాన్ని చూస్తూ చూస్తూ సహించలేక పీడించి పీక్కుతినా లనుకునే మరో 'నొప్పి'లా భావించం డంతే ... ఒక కళాకారుణ్ణి!

మీలో కొందరైనా నాతో ఏకీభవిస్తారనుకుంటా. సమాజాని కడుగడుగునా అనూహ్యమైన నవ నూత్న దృక్పథాన్ని సూచిస్తూ నిజ జీవితాన్ని తరించజేసుకునే బాధ్యతను మరిచి, ఈ ప్రేమ రోగాన్ని సరిహద్దులు మీరనిచ్చి, సౌందర్య దేవతల నారాధిస్తూ అమూల్యమైన బతుకు ఘడియలను వృథా చేసుకుంటున్నా నంటే అదీ ఒక 'నొప్పే' కదూ!

కళ్లెం లేని గుర్రంలా, గుడ్డెద్దు చేలో బడ్డట్టు స్వైరవిహారం చేస్తూ, కనబడ్డ ప్రతి వ్యక్తినీ కంపించి తల్లడిల్లజేసే ఈ గుడ్డి నొప్పి కొక మంచి మందుకోసం మారుమూలలా గాలిస్తూ, అనంతంలో కలిసిపోవడమే ఆనంద మనుకోవడం తప్పా మరి?

'బెటర్ టు బి డెడ్ దాన్ టు బి లివింగ్ లైక్ ది డెడ్' అని కలవరించేవాణ్ణట!

అవీ ఆ రోజులు.

అప్పటికీ, ఇప్పటికీ పోల్చుకుని చూస్తే ఆ పాత నొప్పులన్నీ నొప్పులే కావేమో! ఇప్పుడు లోలోపల రగులుతోం దనంతమైన అసలు మంట!

ఏమిటంటారా? ప్రస్తుతం నాకు తెలిసిన నగ్న సత్య మొక్కటే ... నేను రంగనాయకిని మనసారా ప్రేమిస్తున్నా!

రోజా కాలేజీ బస్సు అలాగే కదిలిపోతోంది. స్వార్థాన్ని కొంత మింగుతూ, కొంత బయటికి కక్కుతూ ప్రొఫెసర్లూ, విద్యార్థులూ బాతాఖానీ కొడుతూ కళాశాల చేరుకుంటా రందులో. పాఠాలూ, ఆట పాటలూ ముగిశాక మళ్లీ సాయంత్రం గృహోన్ముఖు లవుతారు. మిగతా సంఘటన లేవైనా సరే, వివిధ వ్యక్తుల విధి గతమే మరి!

రకరకాల మిషలతో సొంత కారును స్వయంగా చెడగొట్టుకునీ, నేనూ ఆ బస్సులోనే ఈ మధ్య ప్రయాణం చేస్తున్నా. కారణం మీకు వేరే చెప్పాలా? మాతో రోజా రంగనాయకి కాలేజీకీ, ఇంటికీ పయనిస్తుం దందులోనే. ఈపాటికి ఈ బస్సు ప్రయాణకాలంలో ఒక్క రెవరో ఆ అమ్మాయి పట్ల అవసరాని కన్నా ఎక్కువ ధ్యానం వహిస్తున్నట్టు కనిపెట్టిందో, లేదో చెప్పడం కష్టం. కానీ కాలం గడిచినకొద్దీ హద్దు మీరుతోం దీ విచిత్ర వ్యసనం నాకు.

ఒకరోజు ధైర్యం తెచ్చుకుని ఆమె పక్కనే కూర్చుని, "హౌ నైస్ ఈజ్ ది వెదర్!" అనేశా.

నమ్రతతో "ఆ!", "ఊఁ." అనే ఏకాక్షరాలతో జవాబులు దొరికాయి.

నాలుగు నెలల క్రితం లైబ్రేరియన్‌గా చేరింది రంగనాయకి. కళాశాలకు చెందిన అమూల్యమైన కళా చిత్రాలన్నీ కాటలాగ్ చెయ్యడం కూడా ఆమె బాధ్యతల్లో ఒకటి. అందుచేత ఇప్పుడో, అప్పుడో నాతో పరామర్శ చెయ్యడం ఆమె కా ఆఫీసులో తప్పనిసరి. బొంబాయిలోని జె.జె. స్కూల్ ఆఫ్ ఆర్ట్స్‌లాగే మా యూనివర్సిటీ ఆర్ట్స్ సెంటర్ కళలకు పేరెన్నికగల కాణాచి. చిత్రలేఖనం నేర్చుకునేందుకు దేశ విదేశాల నుంచి ఉత్సుక వ్యక్తులు హాజరవుతారు. గొప్పలు చెప్పుకోవడం కాదు కానీ, నా దగ్గర విద్య నేర్చుకున్నా నని చెప్పుకోవడ మో ప్రెస్టేజి పాయింట్ కొందరు విద్యార్థులకు. అది నాకు దైవదత్తమైన ఖ్యాతి. గుడ్డిలో మెల్ల. మనిషికి ఖ్యాతి కూడా మరో తియ్యని 'నొప్పి' కదూ! దీన్ని నాశనం చేసే మందు లనేక మున్నాయి కానీ, ఆర్జించడానికి పరిధులే లేవు మరి!

రంగనాయకి స్వగృహానికీ, కాలేజీకీ ఒక పాతిక మైళ్ల దూరమైనా ఉంటుంది. పట్నవాసపు అగచాట్లు తెలియని వా ళ్లెవరు కనుక! నాలుగు మెతుకులు మింగుడు బడ్డాయో, లేదో పరుగులెత్తి లోకల్ ట్రెన్‌లో ఇరుక్కుని, ప్రయాణం ముగిశాక కాలేజీ బస్సు పట్టుకుని పనిలోకి చేరాలి. ఉద్యోగ వ్యవహారాలు దిద్దుకున్నాక గానుగలో ఎద్దులాగా మళ్లీ అదే చక్రపరిధిలో గూడు చేరుకోవాలి.

"సగం జీవితం ప్రయాణంలోనే గడుపుతావు. అలిసిపోవూ, రంగా?"


'అలవాటేనండీ! మీలాంటి శ్రీమంతులకు సొంత కార్లుంటాయి కనుక రైళ్లల్లో రారేమోలెండి!'

'అమ్మబాబోయ్! ఆ తొక్కుకుని, తోసుకునే జనసమూహం నాలాంటి వాళ్లని కొబ్బరిపీచులా పిప్పి చేస్తారని భయం! అందుకే రైలెక్కను సుమీ!'

"అరే! ఈ విషయంలో మీరు ఆడవాళ్లకన్నా పిరికిపందల్లా ఉన్నారే!"

నవ్వుతూ బస్సు దిగిపోయింది. మళ్లీ దర్శనం కోసం రేపటిదాకా కాచుకు కూర్చోవాల్సిందే.

ఇలా ఎన్నో 'ఇవ్వాళలూ', 'రేపులూ' కాలచక్రంలో మాటుమణిగిపోతున్నాయి.



## సాహస బాలలు - 12



# కాలువలో మునుగుతున్న బాలికను రక్షించిన జోగి ఫ్రాన్సిస్

కేరళ రాష్ట్రంలోని త్రిసూర్ జిల్లా పుతెన్‌చిరా అనే గ్రామంలో 1995 జూలై 28 ఉదయం కుమారి సుజవర్గీస్ అనే నాలుగవ తరగతి విద్యార్థిని తన స్కూలుకు పోయే దారిలో ఉన్న కాలువపై గల కర్ర వంతెన దాటుతోంది. ప్రమాదవశాత్తు ఆ వంతెన అంచున కాలు జారి, కింద ఉన్న కాలువలో పడిపోయింది ఆ అమ్మాయి. పూటుగా నిండి ఉన్న కాలువ ప్రవాహం కూడా వేగంగానే ఉంది. కాలువలో పడ్డ సుజ క్షణాల మీద ప్రవాహ వేగానికి ముందుకు కొట్టుకుపోతూ, నీటిలో మునిగిపోతోంది.

అదే సమయంలో అటు పోతున్న మరో పాఠశాల 8వ తరగతి విద్యార్థి పన్నెండేళ్ల మాస్టర్ జోగీ ఫ్రాన్సిస్ ఆ దుర్ఘటనను చూశాడు. చూసింతే తడవుగా, మరేమీ ఆలోచించకుండా ఆ కాలువలోకి దభాలున దూకాడు. సుళ్లు తిరుగుతున్న కాలువలో ఈదుకుంటూ అతి కష్టంమీద సుజను సమీపించి, ఆమెను గట్టిగా పట్టుకుని కాలువ గట్టుపైకి చేర్చాడు జోగి. సుజ ప్రాణాలతో బయటపడింది.

Ⓟ అనిపెద్ది వెంకట రమణరావు

---

ఏకాంతంగా ఉన్నప్పుడు గంటలతరబడీ ఆమెను గురించే ఆలోచించడం పరిపాటి అయిపోయిందిప్పుడు. నా దైనందిన జీవితం గుర్తు పట్టలేకుండా ఎంత మారిందో! ఆమెను చూడాలి ... వీలైనంత దగ్గరగా కూర్చుని కబుర్లు చెప్పాలి. ఆ ఆనందాని కర్థం చెప్పడం కష్టం. ఆమె దృష్టిలోంచి మాయమైన మరుక్షణం నుంచీ ఆ 'నొప్పి'కి కొలత బద్దలుండ వెందుకో? ఇంతకూ ఇప్పు డామె నన్ను గురించేమనుకుంటున్నదో ఎలా తెలుసుకోవడం? ఇంత ప్రపంచ జ్ఞాన మార్జించిన నాకే ఇదో గడ్డు ప్రశ్నలా తయారైంది.

ఆ రోజు కాలేజీలో మధ్యాహ్నం క్లాసు నడుస్తుంటే మరో స్నేహితురాల్ని కూడబెట్టుకుని అనుకోకుండా మా స్టూడియో వింగ్ కొచ్చింది రంగనాయకి!

"దయచెయ్యండి, చాయ్ తెప్పించనా?"

"లేదండీ! కొంచెం తొందర్లో ఉన్నాం." ఆవిడ స్నేహితురాలే చనువుగా మాట్లాడుతోంది. "ఈవిడ రంగనాయకి! మన లైబ్రేరియన్."

"నాకు తెలుసండీ! రోజూ బస్సులోనూ, ఆఫీసులోనూ కలుస్తూనే ఉంటాం కదూ!"

"ఇదుగో శుభలేఖ! ఈవిడ వివాహం - రేపు ఇరవయ్యే తారీఖు. తమరు తప్పక దయచెయ్యాలి..."

ఆ రెండో అమ్మాయి ఇంకా ఏమేమిటో చెప్తోంది. నాకు ఒక్క ముక్క కూడా వినబడడం లేదు! కాల మేఘాల్లాంటి నా కనురెప్పల్లోంచి కన్నీటి వర్షాన్ని దాచేనుకోవడం దుర్లభమవుతోం దప్పటికప్పుడే. హఠాత్తుగా జ్ఞాపక మొచ్చింది నా జవాబుదారీ, నా అంతర్యుద్ధపు ఆచూకీ ఈ కొత్తమ్మాయికి సుతరాం తెలియకూడదు.

"ఓహో! బ్రహ్మాండమైన వార్త చెప్పారు. చాలా సంతోషమండీ! కంగ్రాట్స్ రంగనాయకిగారూ! ఆ అదృష్టవంతు డెవడో చెప్తారా?"

ఇంకా వాగుతూనే ఉన్నా నాకు తెలియకుండానే. జవాబు లేమొచ్చాయో జ్ఞాపకం లేదు.

మరికొన్ని ముసి ముసి నవ్వులు ...

మరుక్షణం వాళ్లు లే రక్కడ!

ఆ తర్వాత క్షణా లెలా గడిచాయో చెప్పడానికి మాటలు కుదరడంలా. ఆలోచించిన కొద్దీ పద్మవ్యూహ మింకా చిక్కుల్లో కిరికిస్తోంది నన్ను.

'అయిందేదో అయింది. ఇక చా లీ తమాషా. నలభై ఏళ్ల పెద్దమనిషిలా, ఖ్యాతి ప్రాప్త కళాకారుడిలా జవాబుదారీతో జీవితం గడపాలింక!' అనుకుంటూ అనుకుంటూ ఓ నెత్రోజులపాటు కాలేజీలో సెలవు తీసేసుకున్నా. కానీ ఆ బలవంతపు సెలవు లెలా గడపాలో పాలుపోనేలేదు.

కుంచె కదిపితే అంతరిక్షంతో సహా ఆ చంద్ర తారార్కమూ కాన్వాస్ మీద సాక్షాత్కారం చేయించగల శక్తి నా చేతి వేళ్లలోంచి జారిపోయిందేమో నని భయం వేసిం దప్పుడు. నే గీచిన బొమ్మలు నన్నే వెక్కిరిస్తున్నాయి. ఆమె కొక వివాహపు కానుక చిత్రిద్దా మనుకున్నా. పుంఖానుపుంఖాలుగా గీచినా ఉత్తు ఊకదంపుడు చెత్త తయారైనట్టు విఫలమైన మనోవీధి! ఎంత ఏడ్చినా మంచులా ముద్ద కట్టుకుపోయే కన్నీళ్లు!

బొమ్మ గీయడం మానేశా.

బజారు కెళ్లి అందమైన మనీ పర్సు - విలువైన దొకటి కొనేశా. స్వయంగా హాజరై, వివాహపు కానుక నా చేత్తో నేనే ఇవ్వగలనా?

యక్ష ప్రశ్న!

ఆ మనీ పర్సు ఇప్పటికీ నా మంచం కిందే తిష్ఠ వేసుకుని నవ్వుతోంది వికారంగా. ఆ సందిగ్ధావస్థలో నే చేసిన ఘనకార్య మొక్కటే ... పెళ్లికి వెళ్లనేలేదు!

అదే బస్సు.

అదే ప్రయాణం.

రాజకీయాలూ, సినిమాలూ, జీతాలూ, ప్రమోషన్లూ ... అదే బాతాఖానీ.

ఒక్కటే బేధం - ఆమె లే దిప్పు డా బస్సులో.

భరించరాని మరో కొత్తరకం 'నొప్పి'!

ఆవిడ భర్త మళ్లీ ఉద్యోగంలోకి చేరనిస్తాడా? మళ్లీ వస్తుందా? 'హౌ నైస్ ఈజ్ ది వెదర్' అని అడగడానికైనా అవకాశం ఉంటుందా? మామూలుగా మధుచంద్రుడి (హనీమూన్) ఉన్మత్తత తగ్గిం తర్వాత మళ్లీ కాలేజీ కొచ్చితీరుతుందని ఆశిస్తున్నా ననుకుంటా. అయిదా దాని ప్రయోజనం?

శూన్యాతిశూన్యం!

నా సెలవైపోయింది. కాలక్షేపం కావాలంటే కాలేజీకి వెళ్లితీరాలి. భీరువుకు జీవన్మరణం కన్నా కఠినమైన శిక్ష లే దింక! ఈ దెబ్బతో జ్ఞాన చక్షువులు తెరుచుకున్నాయని చెప్పడం కాదు ... కాస్త తెలివొచ్చిందేమో!

చూద్దాం.

సొంత కారు బాగు చేయించుకుని బస్సులో ప్రయాణం మానేసి కాలేజీ చేరుకున్నా.

రే, పవళ్లు బొమ్మలు గీస్తున్నా.

నొప్పిలో పుట్టిన కళ! ఈ నొప్పే చైతన్యంగా మారి చిరస్థాయిగా జీవిస్తుందేమో!

నా చిత్రలేఖన మిప్పుడు కొత్త మలుపులు తిరుగుతోం దంటున్నారు సమీక్షకులు. వాళ్ల కేం తెలుసు?

మరో కొత్త 'నొప్పి' దారితీస్తున్నదేమో! కాదు, నే పొరబడుతున్నా. ఈ యమ యాతన నా దేహానిదే. అంతర్వాణి అచంచలం. దాన్ని నలిపెయ్యకుండా, ఆ అడుగుజాడల్లో నడుస్తూ పోయిన క్షణాల్లోనే కామోసు, కించిత్తైనా నా కళ కో అమృతత్వం ప్రదానమై ఉంటుంది!

ఉవ్! నా రేఖలే న న్నంతర్ముఖుణ్ణి చేస్తున్నాయే! విరిగిపోయిన విరహ బాధలన్నీ వినూత్నమైన కళాకృతుల్లా కేంద్రీకరించు కుంటున్నాయా?! నాకే విస్మయం!

హఠాత్తుగా లిఫ్ట్ దగ్గర అదే తియ్యని కంఠం - మత్తకోకిలను మరపించే కోమలమైన స్థాయిలో!

"నమస్కారం ప్రొఫెసర్‌గారూ! ఎలా ఉన్నారు? నా పెళ్లికి మీరు రానేలేదు ... ఎంతో 'ఇది'గా అనిపించింది."

క్షణకాలం నా రెండు పాదాలూ భూకంప పీడితమైనట్టు దద్దరిల్లాయి. ఇట్ వజ్ ఎ థౌజండ్ వోల్ట్ ఎలక్ట్రిక్ షాక్! ఆమె అలా కనిపించడం నన్ను పరమానందభరితుణ్ణి చేసిందా, లేదా ఆనంద మనే రేర్ కమాడిటీ నా బతుకులోంచి మాయమై లక్షలాది మైళ్ల దూరంగా ఎగసి మిన్నంటి, కన్నీటి బొట్టుకే నాకు తీరని కరువు కల్పించిందా? జవాబు చెప్పలేను.

తరాలుగా వల్లె వేసిన తు.చ. తప్పని మంత్రోచ్చారణ మీట నొక్కిన టేప్ రికార్డర్‌లోంచి వెలువడినట్టు శబ్దం! "కంగ్రాచ్యులేషన్స్! క్షమించాలి ... నేను హాజరు కాలేకపోయాను. భగవంతుడు మీ దంపతులకు వెయ్యేళ్లపాటు ఆనందభరితమైన జీవితం వరప్రసాదంలా కటాక్షించాలి!"

"థాంక్యు, సర్!"

లిఫ్ట్ పైకి వెళ్లింది. గాఢమైన గాలి వాన నన్ను మేఘాల్లోకి తన్ని ఎగరేసినట్టు భావన. ఎంతసేపలా నీళ్లలోంచి బయట పడ్డ చేపలా తన్నుకున్నానో! నీళ్లు కాదు, నిప్పది! మెల్ల మెల్లగా నిప్పులోంచి తప్పుకుని గుండె మళ్లీ కదులుతున్నట్టుంది. అంత మంటను తట్టుకోగల నా కిప్పు డంతా మంచుమయంలా ఉంది శరీరం!

జన మెలా బతికినా సరే, రోజులు గడిచితీరాలి. అది లోకం తీరు.

గడుస్తూనే ఉన్నాయి.

మళ్లీ నే చేసిన పిచ్చి పనులలో మచ్చుకు మరోటి చెప్పగలరా? జవాబుకోసం ఒక హింట్ - నా కారు మళ్లీ చెడిపోయింది.

పెళ్లయ్యాక ఎంత మార్పు!!

మధుచంద్రుని మాయగామోసు! కాశ్మీర్ షాలిమార్ గార్డెన్స్‌లో కళకళలాడే రోజా పువ్వులా మెరుస్తోం దావిడ! ప్రతి మజ్నూ కళ్లల్లో లైలా అలాగే కనిపించడంలో ఆశ్చర్య మేముంది కనుక! ఎంత నలిగినా మల్లెపువ్వుల్లాంటి పెదిమల్లో సునిసితత్వం పెరిగిం దేమో - తరిగినట్లు లేనే లేదు. హరివిల్లులాంటి ఆ భృకుటి నన్ను వెయ్యి ప్రశ్నలు వేస్తున్నదేమో, వాటి భావం ప్రపంచాని కేం తెలుసు కనుక! ఆ యవ్వన రేఖల నిలా వర్ణిస్తూపోయే కన్నా నా అనుభూతిని మళ్లీ చిత్రలేఖనంలో పొదిగితే...?

అదే కర్తవ్యం.

మ రెందు కీ అవకతవకల తలుపులు! ఎంత అదృష్టవంతుడో ఆమె భర్త! ఛీ ... అసూయకు అంతుండాలి... ఆమె 'నాది' కాజాలదని తెలిసి కూడా ఇలా ఆలోచిస్తున్నా నంటే ఇవన్నీ బలహీనుడి భ్రష్ట స్వప్నాలేమో!

కావచ్చు.

కానీయండి.

మొద్దుబారిన నా మెదడు వక్రగతిన నడుస్తోంది. నడవనివ్వండి. ప్రేమించడం, కామించడంలో భేదం మరిచిపోయానా?! ఇదొక తర్కరహితమైన ఉన్మాద స్థితి.... పిచ్చి... ఈ దీన స్థితిలో న న్నలా వదిలేయండి. అదే ప్రస్తుతం ఈ 'నొప్పి'కి మందు.

అప్పుడప్పుడూ ఉద్యోగరీత్యా ఆర్ట్ కేటలాగ్ విషయంలో చర్చించడానికి నా స్టూడియోలోకి వస్తూనే ఉందీమధ్య. ఈపాటికి నే నెలాంటి వాణ్ణో ఆమెకు క్షుణ్ణంగా తెలిసుండాలి.

ఒక స్మరణీయమైన ఘటన!

జపాన్నుంచి వచ్చిన ఉచ్చస్థరీయ కళాబృందాన్ని మా కళాశాల వా ళ్లాహ్వానించారు. ఆ రోజు మీడియా లైమ్ లైట్ నామీదే. రేడియో, టెలివిజన్, పాత్రికేయుల సమక్షంలో ఆ గౌరవనీయులైన అతిథులందరూ నా చిత్రాలను శ్లాఘించారు. అన్నిటిలోకీ నచ్చిన 'రంగంలో నా రంగుల పయన'మనే చిత్రాన్ని స్నేహ సూచకంగా వారితో స్వదేశం తీసుకుపోవడాని కేర్పాట్లు జరిగాయి. ముద్దు కృష్ణుడు నోరు తెరిస్తే ముల్లోకాలూ స్ఫుటమైనట్టు, రంగు రంగుల రంగనాయకి అనంత సౌందర్య విశ్వరూప దర్శనమే ఆ చిత్రపు అంతరార్థమని నాకు తప్ప మ రెవ్వరికి తెలును కనక! అయినా మొనాలిసాలా ఆశ్చర్యజనకమై కనపడీ కనపడని చిరునవ్వులతో, ఆమె భంగిమ అమాయకులను కూడా ఆకట్టుకుంటుందంటే, నన్ను నేను పొగడుకుంటున్నా ననుకోకండేం!

అతిథుల నిష్క్రమణతో పార్టీ కోలాహలం ముగిసింది.


విచిత్రం!

ఆమే - నేనూ.

చివరి కా రోజున స్టూడియోలో మిగిలింది మే మిద్దరమే. గుండె శరవేగంతో పరుగులెడుతోంది. ఆ సువర్ణ ఘడియల నలా వృథాగా పోనివ్వాలా?

"రంగా ...! ఎలా చెప్పాలో తెలియడంలేదు. నేను ... నిన్ను ... నున్ను ... ప్రే..."

అంత పెద్ద కళానిధిని! సర్వ సామాన్యమైన ఆ రెండే రెండు ఊకదంపుడు పదాలను ఒక అతి సాధారణమైన సహోద్యోగినితో చెప్పడాని కెంత



భయపడ్డానో.

"ఏమి టలా తడబడుతున్నారు? చెప్పదలుచు కుందేదో చెప్పెయ్యరాదూ?" తంబురాతో శ్రుతి కలిసిన సంగీతపు కెరటాల్లాంటి ఆమె మాటలు నా వీనుల విందు కలిగించాయి. మతిపోయింది. పదిసీసాల సారాయి ఒక్క గుటకలో మింగేసినట్టు తేలిపోయింది నా దేహం!

"నీకు తెలుసా ... నిన్ను మనసారా ప్రేమిస్తున్నా, రంగా!"

రక్తహీను లుప్పొంగినట్టు లాలిమతో కందిపోయిం దామె వర్చస్సు. అయినా చలించక, అతి చాకచక్యంతో తన్ను తాను సంబాళించుకుని, అన్నది మెల్లగా - 'అవునేమో! ఐ థాట్ దేర్ వజ్ సమ్‌థింగ్ రాంగ్ విత్ యు. మళ్లీ కలుస్తాను, సార్! ... బై ...!"

వెళ్లిందో, లేదో, వేల చందమామలు నా గుండె మబ్బుల నావరించినట్లనిపించింది.

ఆమె నన్ను క్షమించిందా?

కాదు...కాదు...ఆమెకూ నేనంటే 'మమతే'మో!

రబ్బిష్! నా హోదాకు తగిన ఉచిత వ్యవహారమే ఆమె గొప్పతనం. అలా తప్పుకోవడంలోనే ఉంది ఆమె చాకచక్యం. అంతకుమించి మరేమీ చెప్పుకోదగ్గ భావోద్రేక మీ ఘటనలో లేదేమో?

కాలమే తేల్చాలి.

గౌరవ మర్యాద లెరిగిన గుణవంతురా ళ్లందరూ ఇలాగే వర్తిస్తారనుకోవడం సహజమే కదా!

అయినా మా ఇద్దరి మధ్యగల దూరం తగ్గిందేమో నని నిశ్చింతగా తెలుస్తోంది మరి నా కెందుకో. బస్సులో, స్టూడియోలో, లిఫ్ట్ దగ్గర, మెట్ల మీద ... ఎక్కడోక్కడ, ఏదో ఒక మిషమీద పదిసార్లయినా కలుస్తూనే ఉంటాం.

ఇంకా మంచి బొమ్మలు గీయమంటుంది.

ఇంకా ఖ్యాతిని గడించమంటుంది.

వయస్సుకు మించిన నా చిలిపి చేష్టలు హద్దు మీరినా నా మనస్సును నొప్పించే ము క్కొక్కటైనా పలకదు! కాలేజీలో ఎక్కడున్నా సరే రోజు కోసారి ఫోన్ చేసి నా క్షేమ సమాచారాలు పరామర్శిస్తుంది.

ఎంత దయామయి?!

నిజం చెప్పాలంటే ఆమె వాలకం నా కసలు అర్థమవవడంలా. వివాహమై పట్టుమని పది వారాలైనా గడవలేదు. ఆమెకు న న్నిలా కేర్ చెయ్యాల్సిన అవసర మేముంది?

నా ప్రేమోన్మత్తత కామె కూడా చలించిందా?

ప్రేమ గుడ్డిదే కానివ్వండి. న న్నెలాగూ ముంచేసింది. పరవాలేదు... కాగా పోగా, ఆమె కొత్త కాపురానికే అవాంతరాలు సృష్టిస్తే?

అదే నా కొత్త 'నొప్పి'కి కారణం. అయినా సరే, ఇలా గడవనీయండి కాలాన్ని!

ప్రతి సాయం సమయం ఆమె బస్సు దిగి రైలెక్కబోయే ఘడియల్లో కొంచెమైనా శమనం కలిగించే ప్రాణవాయువు పరిసరాల్లోం చిట్టే ఉక్కు గొలుసులతో బంధించి, మళ్లించి మళ్లీ నాలుగు చీకటి గోడల మధ్యకు లాగేయబడే ఖైదీలా తపించి కొట్టుకునేది నా నాడి.

లైబ్రరీలో కొత్తగా చేర్చబడిన మోడరన్ ఆర్ట్ మీద రాసిన విసూత్నమైన పుస్తకాన్ని తెచ్చిం దా రోజు నా స్టూడియోలోకి.

"థాంక్స్! నిన్న బస్సులో రాలేదేం? నే నెంతో కాచుకు చూశా మీ కోసం."

"సారీ, నా భర్త నాకు ఫోన్ చేసి త్వరగా రమ్మన్నా రింటికి. ఆయన పుట్టిన రోజు నిన్న."

న్యాయాతిన్యాయం. వాళ్ల కలా చేయడాని కన్ని హక్కులు ఉన్నాయ్ మరి! ఆ ఆనందా న్నాపడానికి భగవంతుడికి కూడా అధికారం లేదేమో!

"క్షమించాలి, ఇంకెప్పుడన్నా ఇంటికి త్వరగా వెళ్లాల్సొస్తే మీకు ఫోన్ చేసి చెప్తాను."

తటిల్లతలా కదిలించిం దా జవాబు నన్ను.

నే నేమాత్రమూ ఇలా చెబుతుం దనుకోలేదు. పోతపోసిన బంగారు విగ్రహంలా నా ముందు నుంచున్న ఆమె యవ్వనాన్ని క్షణ క్షణం జుర్రేస్తున్నాయి నా కళ్లు.

వరవశమై పోయానేమో! రెప్ప మూసి తెరిచేలోగా జరిగిం దీ అఘాయిత్యం. శక్తికి మించిన ఉద్రేకంతో నా కౌగిలిలోకి లాక్కుని, తనివితీరా ఆలింగనం చేస్తూ, ముద్దుల వర్షం కురిపించా - నేనే ఆమె భర్తనులా!

గాయపడ్డ సంహంలా గాండ్రిస్తూ తోసేసింది నన్ను. కళ్లు నిప్పులు కురుస్తున్నాయి.

"పశువులా వర్తిస్తారని నే ననుకోలేదండీ! ఇది తగునా మీకు? ఇదేనా మీ పెద్దతనం?"

"క్ష...మిం...చా...లి..., రంగా! నిన్ను ... నొప్పించాను... మరింకెప్పుడూ మితిమీరను...!"

నా మాటలు పూర్తిగా విన్నదో, లేదో - ఆమె అక్కడ లేదప్పుడు.

ఫోనొచ్చింది.

"ఎలా ఉన్నారు?"

గుండెల్లో మరో రామబాణం! ఆమే!!

ఆ గొంతులో చలించిన సంజ్ఞలు లేనే లేవు.

చప్పగా నీళ్లు నములుతూ అన్నాను - "ఐ యామ్ సారీ!"

"డోంట్ వర్రీ, సార్! బట్, జస్ట్ రిమెంబర్ ... ఐ హేవ్ ఎనీ వన్ టచ్చింగ్ మై బాడీ ... ఎక్సెప్ట్ ... ఎక్సెప్ట్ ..."

సంభాషణలో అవాంతరం ... తోక చుక్కలా తేలిపోతున్న నా మనస్సు.

గుడి గంటల్లా ఖంగుమనే దడ!

అజంతా ప్రతిమలాంటి ఆమె సునిశిత దేహాన్ని అణువణువునా స్పృశించి ఆనందించగల ఆ మహానుభావు డెవడో ఆమె బంగారు పెదవుల్లోంచే ఊడిపడా లిప్పుడు ...

"మై హజ్బెండ్ ఎలోన్!"

నిశ్శబ్దం.

గుండె లాగిపోయిన ట్లాగిం దా ఫోన్.

గ్లాసెడు చన్నీళ్లు తాగి మనోద్వేగపు ఉష్ణోగ్రత తగ్గించుకున్నాక, కారణ సహితంగా తర్కించడం మొదలెట్టింది తనలో తానే, నా వెర్రి మనసు.

'ఈ ప్రేమ రోగానికి బహిర్గత చిహ్నాలుగా, నీ భావాలన్నీ మాటిమాటికీ ఊసరవెల్లిలా రంగులు మార్చుకుంటున్నాయే కానీ, ఆమె మాత్రం స్వీయ వరిస్థితికి తగ్గట్టు అతి సహజంగా ప్రవర్తిస్తోందోయ్!'

'వెర్రి మనసా! అయితే ఐ డోంట్ లవ్ ఎనీబడీ, ఎక్సెప్ట్ మై హజ్బెండ్! అని సాఫీగా నాతో చెప్పి, నా ఆట కట్టించొచ్చుగా! ఈ నా కోతి

## గణితంలో ఆసియా ప్రజలు ...

అమెరికా ప్రజలకంటే ముందున్నారు. ఇందుకు కారణం అమెరికా వాసులకి 11,12,13 మొదలైన అంకెలు అంత త్వరగా జ్ఞాపకం రావడంలేదు. తెలుగులో అయితే పదకొండు, పన్నెండు, పదమూడు అంటూ పదిని అంటిపెట్టుకొని చదువుతాము. జపాన్ భాషలోనూ అంతే, తమిళ భాషలోనూ అంతే కాని ఆంగ్లంలో అలా కాదు. ఎలెవన్, ట్వెల్వ్, థర్టీన్ అని ఒకదాని కొకటి సంబంధంలేని వ్యతిరేక శబ్దాలవటంచేత చప్పున జ్ఞాపకానికి రావు. అందుచేతనే అమెరికా వాసులు ఆసియా ప్రజల కంటే గణితంలో వెనకబడిపోతున్నారట.

శ్రీకొండ (ఎర్రబోడు)

చేష్టలన్నీ భరించాల్సిన అవసర మెందుకొచ్చిం దప్పుడు?'

మొదటిసారిగా మరో పిచ్చాలోచన తట్టింది.

ఇందుకు మూడే మూడు కారణాలుండవచ్చు. ఒకటి నా కళ మీద కొంచెం తియ్యటి దృక్కు లున్నాయేమో తప్ప, తన భర్త నామె గాఢంగా ప్రేమిస్తోంది. రెండు : నా మనసు నొప్పించడ మామె కిష్టం లేదు కనుక తనకు సూటిగా ఘోరమైన అన్యాయమో, అపవాదో జరగనంతవరకూ ఆమె కీ ఆట కట్టించాల్సిన అవసరం లేదు. మూడు : దీన్ని డేంజరస్ థింకింగ్ అనొచ్చేమో - తన భర్తనూ, నన్నూ మించి, తను ప్రేమించే మరో వ్యక్తెవరో తన జీవిత స్వప్నాల నాచ్ఛాదించి ఉండవచ్చు!!

నాలాగే ఆమెకూ 'నొప్పు' లెన్నో లేవు కదా!!

పుట్టలో దాగిన పాములన్నిటినీ ఒక్కుమ్మడి లెక్కపెట్టడ మెవరితరం?

ఛా! ఆమె సుగుణాల నెంత నీచంగా అంచనా వేసుకుంటున్నానో! స్టొపిట్!

బ్రహ్మాండ మంతా ఉరుములూ, మెరుపులతో దద్దరిల్లుతున్న పిచ్చి వాన!

నొప్పి!!

టెలిఫోన్ రిసీవర్ తీసి లైబ్రరీ నంబరు తిప్పాను. అవత లెవరున్నారో, విన్నారో లేదో గ్రహించకుండానే అరిచేశా!

"ఇహ నుంచి నాతో మాట్లాడాల్సిన అవసరం లేదు. ఆఫీసు పనుంటే ఫైల్స్ పంపించండి. గుడ్ బై!" మేఘ గర్జనల్లో టెలిఫోన్ బల్లమీద నేను బాది గిరాటేసిన వెర్రి శబ్దం నాకే వినిపించలేదు.

నాలుగు రోజులు నాలుగు శతాబ్దాల్లా గడిచాయి.

బస్సులో ఆమె అటూ, నేను ఇటూ. ఏ మాత్రం చూపులు కలిసిన సంజ్ఞలే లేవు. తిండీ తిప్పలు వాటంతటవే మానేశాయేమో!

కచ్చితంగా తెగతెంపులైనట్టు మొండి యాతన. సప్త సముద్రాలూ ఎండిపోయి బావురుమన్న ట్టేడుస్తున్నాయి. సూర్య చంద్రులు సొంత కాంతినే కోల్పోయారేమో!

నా కుంచె కదల దింక!

నా గొంతు పలక దింక!

అంతర్వాణి ఆరిపోయింది!

ఆకాశ పాతాళంలోకి జారిపోయింది!

ఛీ! అంత భీరుత్వమైతే ఎలా? నిరాశ కంతుండాలి ... ఈ పిచ్చికి, ఈ నొప్పికి మందు వెతికి తారాలి.

మొండి చేసుకుని ఫోన్ చేసి గమ్మున కూర్చున్నా.

"హూ ఈజ్ కాలింగ్ ప్లీజ్?" అదే సన్నటి శ్రావ్యమైన కంఠం.

"క్షమించు, రంగా! ఫర్ గాడ్స్ సేక్, ప్లీజ్, కమ్ అండ్ టాక్ టు మి ... నీతో మాట్లాడని ఈ నిశ్శబ్ద క్షణాలన్నీ బాకుల్లా నన్ను పొడిచేస్తున్నాయి. ఈ యుగాంత మిలా కానీయకు, రంగా!" దూరంగా అస్పష్టమైన ఉచ్ఛ్వాస నిశ్వాస శబ్దాలు.

"ఊఁ, ఇంకెప్పుడూ నా మొహం చూడరేమో ననుకున్నా! మాటల కందని భావనలన్నీ కాన్వాస్ మీద రేఖలుగా మారిస్తే ఎన్ని జన్మలో తరిస్తాయి కదుటండీ! బతకనేర్చిన మగవాళ్ల ... బ్రహ్మాండమైన మీలాంటి కళాకారు లిలా వర్తిస్తే బాగుంటుందా? అందమైన ఆడవాళ్ల నందర్నీ బారులు తీర్చి బాహ్యంగా ప్రేమ గీతా లాలపించ మనడం లోకం తీరా? అనువైన గుండిగ వంటకాన్నీ ఒకే ముద్దలో మింగేయాలంటే వీలవుతుందా? ఓ చిన్న ఉద్యోగస్తురాల్ని ... మీలాంటి ప్రతిభాశాలులకు శ్రీరంగనీతులు చెప్పడం నాకు చేతకానే కాదు. అయినా సహజంగా ఆడదాన్ని ... సముద్రాల్లోని వజ్ర వైఢూర్యాలు చూసి మురిసిపోతానే కానీ, ఉప్పునీళ్లని గర్హించుకోను. కాలం కడుపులో ఎన్ని రహస్యాలు దాగి ఉన్నాయో! గుప్పున భవిష్యత్తు నంతా గుక్కతిప్పుకోకుండా కక్కెయ్యమంటే వీలుపడుతుందా? శాంతించండి ... నా తప్పులుంటే క్షమించండి ... ఉంటా!"

ఈ ఫోన్ ఇలాగే శతాబ్దాలదాకా పలుకుతుంటే ఎంత బావుణ్ణోస్మీ!

ఆగి ఆగి ఆలోచిస్తూనే కూర్చున్నా. అంతా నిజమే. అయినా ఈ లవ్ - హేట్ - రిలేషన్‌షిప్‌లో సిసలు తేలిన అర్థం శూన్యం!

నచ్చినా, నచ్చకపోయినా నాకు మరో గత్యంతరమంటూ లేదు కదా! ఇప్పు డీ 'నొప్పి' కిదే మందు.

చూద్దాం ...!

వసంతం! పువ్వులు పరిమళించే కాలం!

ఇప్పుడు నే గీసిన తైల చిత్రాల్లో పరిమళమూ, కవనమూ కలిసిమెలిసి ఉట్టిపడుతున్నట్టు నాకే అనిపిస్తోంది. నన్ను పీల్చి పిప్పి చేసే నొప్పులన్నీ నా కుంచెల్లో ఇంద్ర ధనుస్సులై మెరుగులు తీర్చిదిద్దుతున్నాయేమో!

మండు వేసవి! రగిలే మనసులూ, పగిలే గుండెలతో రాళ్లు కక్కుతున్న రేఖా చిత్రా లవి! పికాసో చూస్తే ఏమనుకునేవాడో?

ఆకులు రాలిపోయాయి. చలికాలపు మంచులో మమత లన్నీ మాటుమణిగిపోయాయి.

మట్టిలో పుట్టి మట్టిలో మరణించినట్టు మనలాగే, నా బొమ్మలెన్నో అకాల మృత్యువుపా లయినాయి నా ఆశల అంచుల నందుకోలేక.

ఆ సంవత్సరమలాగే గడిచింది.


ఆమె నా కిచ్చిన మాడర్న్ ఆర్ట్ పుస్తకం వాపసు చేసే మిషతో ఈసారి లైబ్రరీకి నేనే వెళ్లాను.

ఒక సీనియర్ ప్రొఫెసర్‌కు గౌరవార్థంగా లేచి నుంచుంది కుర్చీలోంచి ...

గుండెలో పువ్వులా త న్నారాధ్య దేవతలా పూజించే ప్రేమికుడిలా తన కౌగిటిలో గుచ్చేసుకుని న న్నాహ్వానిస్తే ఆ ఇంద్రలోక సుఖ మెలా ఉండేదో!

ఆ కలలు నిజమయ్యే రోజు లిక రావు కదా! అయినా ఆ 'నొప్పి' న న్నిప్పుడు బాధించడం మానేసిం దించుమించు.

ఇప్పు డామె దీర్ఘకాలపు సెలవుమీద వెళ్తోందట.



రాలిన పువ్వులు వాడి మగ్గిపోవడం తథ్యం కదా! ఈ ప్రేమ గ్రంథంలోని ఆఖరు అధ్యాయపు చరమ చరణం నా కనురెప్పల కంతల్లోంచి స్పష్టంగా తొంగి చూస్తోంది.

"రంగా! సెలవుమీద వెళ్లే ముందర ఏ హోటల్‌లోనన్నా పది నిమిషాలపాటు కలుద్దామా? మనసుల బాటలు వేరైనా మాటుమణిగిన జీవితార్థాలు నిర్ణయించుకోవచ్చు."

"అది జరగని పని, సార్! నాకు నా జీవితం నిలువుటద్దంలోలా స్ఫుటంగా కనిపిస్తోంది. మీకే ఆ అనుమానాలు."

'అవునే అనుకో ... కొంచెమైనా కరుణించవా, రంగా! నాకోస మీ మాత్రం త్యాగం చెయ్యలేవా?'

దూరంగా ఆకాశంలో అరుణాస్తమయ వర్ణిమలు ...

"దీనికి, త్యాగానికీ సంబంధ మేమిటి సార్? నా జీవితనౌక ఎటు గాలి వీస్తే అటు తిరుగుతూ గట్టు చేరుకుని తీరుతుందనే దృఢ నమ్మకం నాకు సెల్ఫ్ కాన్ఫిడెన్స్ నిస్తుం దంతే! అందుకే ఈ క్షణ భంగురమైన చిన్న చిన్న చేష్టలకూ మలుపులకూ తగని ప్రాధాన్యత ఇవ్వకూడదేమో, సార్!"

"పోనీ, ఒక్క చిన్న సహాయం చెయ్యగలవా?'

ఎవ్విరీ క్లౌడ్ హేజ్ ఎ సిల్వర్ లైనింగ్! మరిచిపోయిన 'నొప్పి' చీకటిలా నన్ను దిగమింగుతున్న దెందుకో మళ్లీ. తడబడుతూ, బిత్తరి చూపులతో ఆమె జవాబు కోసం ఎదురు చూస్తున్నా ... 'రంగంలో నా రంగు రంగుల పయనం' చిత్రంలో ఆమె మొనాలిసా లాంటి చిరునవ్వు జ్ఞాపకమొచ్చింది.

అమృతం కురిసిం దా క్షణంలో. మరణించే రోగికి హనుమంతుడొచ్చి సాక్షాత్ సంజీవని దానం చేసినట్టు, ఆమె నా చేతి నందుకుని హిమగిరి శిఖర ద్వయంలా తన వక్షస్థలంలోంచి తొంగి చూసే పయోధరాలపై మెల్లగా స్పృశింపజేసింది!

"బ్రహ్మరాతకు పునః సృష్టి చేయగల కళాకారుని హస్తాలివి. సద్వినియోగం చెయ్యండి ... నేనిప్పుడు చెప్పబోయేది మీకు నచ్చదు.. బాధపడతారని తెలుసు. అయినా వినండి. నా భర్త నన్నెంతో ప్రేమిస్తాడు బహుశా మీకన్నా ఎక్కువేనేమో! కలిసి తింటాం, కలిసి పడుకుంటాం. ఆయన కన్యాయం చెయ్యడ మంత సులువైన పని కాదు కదా! అయినా మీలాంటి ఖ్యాతి ప్రాప్త కళాకారుని తియ్యని భావనల కడ్డురావడానికి నాకు మనస్సు పోలేదు. నేనూ ఆ 'ప్రేమ' అనే 'నొప్పి' కప్పుడో, ఇప్పుడో బలి అయినదాన్నే!"

మాట లింకా ముగియలేదు.

ప్రళయం దగ్గర దగ్గర కొస్తోంది.

బ్రహ్మాండం వగిలే శబ్దం...

శివుడు మూడో కన్ను తెరుచుకుని విజృంభించిన తాండవ నృత్య దృశ్యం ...

ఆ నన్నాంయిలాంటి గొంతులోంచి వెలువడ నున్న దొక మృత్య గీతిక. ఒక స్వాన్ సాంగ్ ... ఇలా ఎందు కనిపిస్తున్నదో నా అంతరాత్మకే తెలియాలి.

"అసలు విషయం చెబుతున్నా ... ధైర్యం చేసుకుని వినండి. నా పదహారేండ్ల వయస్సులో ఎంతో అందమైన, బుద్ధిమంతుడైన యువకు డొకడు నన్ను గాఢంగా ప్రేమించాడు. గుండ్రటి కళ్లు, భీమునిలాంటి చేతులూ, ఉంగరాల జుట్టూ... నేనూ అతని ప్రేమలో కృష్ణుడికోసం మీరాలా తపించిపోయాను. చెప్పొచ్చే దేమిటంటే, తనూ ఒక ప్రతిభ గల చిత్రకారుడే! ఢిల్లీలో అతని నివాసం. ఉద్యోగ రీత్యా మీ ఊరొచ్చినా, కళతో నా అవినాభావ సంబంధా న్నొదులుకోలేదని మీ రనుకోకపోరు. మీలో ఆ యువకుడి రాగచ్ఛాయలు చూస్తూ చూస్తూ అనుకోకుండా మీ మీద కూడా మమకారం పెరుగుతూ వచ్చింది. ఈలోపే, మావాళ్లు ఎన్నాళ్లనుంచో నిశ్చితమైన మా మేనబావ సంబంధం ఖాయం చేశారు. నా పెళ్లయింది. చిత్రమైన త్రిశంకు స్వర్గం కదూ! కానీ, మా బావ నాకు సుపరిచితుడే ... ప్రియుడే ... మా తల్లిదండ్రుల ప్రీతికోస మా మాత్రం నమయానుకూలంగా వర్తించడం నాకు స్వాభావికమే నని మీతో చెప్పనక్కర్లే దనుకుంటా. ముందే మనవి చేసుకున్నా ... మీకు నీతులు నేర్పగల చరిత్రా, భావుకతా - రెండూ నాకు లేవు కదా! నాలాంటి సీతాకోక చిలకలకు జీవితమే ఒక రంగురంగుల స్వప్నం. రంగులు మార్చుకునే ఊసరవెల్లి చలనం ... మొన్ననే మావారికి ఢిల్లీ ట్రాన్స్ఫర్ అయింది. కళలతో కళకళలాడే నా ఉద్యోగం మానేయవద్దనీ, తనే ఈ ఊళ్లోనే మరో ఉద్యోగం వెతుక్కుంటాననీ ఎంతో 'ఇది'గా చెబుతున్నారు. అయినా ... అయినా చెప్పలేను, బహుశా ఢిల్లీకి కాపురం మార్చేసే సూచనలే అధికం. కానీ ఒక్క ప్రార్థన ... నే నెక్కడున్నా ... ఈ పృథ్వీ, ఈ ఆకాశం, ఈ సూర్య చంద్రులూ మారరు కదా! మీరూ, నేనూ అలాగే ననుకోండి. జీవితాన్ని చిత్రిస్తూ పొండి. మీ భావుకతను ఆ 'నొప్పి'ని పంచుతూ పొండి... మరి సెలవా!"

అర్జునునికి కృష్ణుడు బోధించిన భగవద్గీత పాఠంలా ఉందామె కథనం నా వీనులకు.

అదే ... అదే ... అనవరతం స్మరిస్తూ... విస్మరిస్తూ గాఢ నిద్ర పట్టినట్టుంది.

ఈ పృథ్వీ, ఈ ఆకాశం, ఈ సూర్య చంద్రులూ, అనూహ్యమైన అద్భుత అంతరిక్ష రంగంలోంచి నా రంగు రంగుల పయనం చూస్తూ చూస్తూ కాలవాహినిలో మాయమైపోయారు!

'కాలధర్మం చేసిన ప్రొఫెసర్ గారి గౌరవార్థం యూనివర్సిటీ ఆర్ట్స్ సెంటర్ మూడురోజులు మూసేశారు. తన చిత్ర కళాకృతులతో ప్రపంచాన్ని ఉర్రూత లూగించిన ఆయన ఆఖరు క్షణా లెంత హృదయవిదారకంగా గడిచాయో, చిత్రాలతో సహా తను స్వయంగా రాసుకున్న ఈ డైరీ విశేషాలన్నీ మా విశేష విలేఖరి సహాయంతో ప్రకటిస్తున్నాము. త్వరలోనే ఆయన జీవిత చరిత్ర సినిమా రూపంలో కూడా తీయబోతున్నారట ...'

ఢిల్లీలో కూర్చుని ఆదివారం న్యూస్ పేపర్ చదువుతున్న రంగనాయకి, రాతిబొమ్మలా నిశ్చేతనమై కూలబడింది కుర్చీలో!

P

## మిథ్య

'**హం**గరీలో కమ్యూనిజం ఉండగా ఒకసారి రాజధాని బుడాపెస్ట్ నుండి అగ్రికల్చరల్ ఇన్‌స్పెక్టర్ వచ్చాడు. ఉమ్మడి వ్యవసాయ క్షేత్రాల లో ఉత్పత్తి బాగా లేకపోయిందని చెప్తే ఏం శిక్ష విధిస్తాడోనని రైతులకు భయం. అందుచేత బంగాళాదుంపల దిగుబడి గురించి ఇన్‌స్పెక్టర్ అడగగానే, ' కమ్యూనిజం ధర్మమా అని ఈ ఏడాది బ్రహ్మాండంగా పండిందనుకోండి. అన్ని క్షేత్రాలలో పండిన బంగాళా దుంపలు కలిపి ఒక గుట్టగా పోస్తే ఆకాశంలో భగవంతుని పాదాలదాకా చేరతాయనుకోండి' అన్నాడు ఒక హుషారైన రైతు

సమాధానానికి సంతోషించినా, కమ్యూనిజం పాఠాలు సరిగ్గా ఒంటబట్టనందుకు నొచ్చుకున్న ఇన్‌స్పెక్టర్ - 'మరీ అంత ఇదిగా చెప్పవద్దు కామ్రేడ్! భగవంతుడనేది మిథ్య అని తెలుసుకో' అంటూ మందలించాడు.

'తెలుసు కామ్రేడ్! కాని మా బంగాళాదుంపలు కూడా మిథ్యే కదా అని అలా చెప్పా' అని చెప్పాడు ఆ కర్షక మేధావి.

సేకరణ: **ఎమ్బీయస్ ప్రసాద్**